క్లుప్తంగా

బొలెరోను లాక్కెళ్లిన బల్కర్



బల్కర్ ఈడ్చుకెళ్లిన బొలెరో వాహనం

ముత్తుకూరు: మండలంలోని బ్రహ్మదేవి సమీపంలో ఏపీజెన్‌కో రోడ్డు కూడలిలో గురువారం ఆగి ఉన్న ఓ బొలెరోను సిమెంటు బల్కర్ ఒకటి ప్రమాదవశాత్తు ఈడ్చుకువెళ్లింది. స్థానికుల కథనం మేరకు జెన్‌కో వైపు వెళ్లేందుకు ఓ బొలెరో వాహనం నిరీక్షిస్తుండగా ఈ ప్రమాదం జరిగింది. ముత్తుకూరు వైపు వస్తున్న ఓ బల్కర్ హఠాత్తుగా బొలెరో వాహనాన్ని తగులుకొని, కొద్దిదూరం ఈడ్చుకెళ్లింది. అయితే, ఈ ప్రమాదంలో ఎవరూ గాయపడలేదు. కృష్ణపట్నం సీఐ వేమారెడ్డి ముత్తుకూరుకు వస్తూ ఈ ప్రమాదాన్ని గమనించి పరిశీలించారు.

సీజేఎఫ్ఎస్ భూముల పరిశీలన



భూములను పరిశీలిస్తున్న ఆర్డీఓ మలోలా

ఇందుకూరుపేట: మండలంలోని ముదివర్తిపాళెం, కాలవమూల కండ్రిగ గ్రామాల్లో సీజేఎఫ్ఎస్ భూములను గురువారం ఆర్డీఓ ఎ.మలోలా పరిశీలించారు. అసైన్‌మెంట్ పట్టాల మంజూరుకు ఈ భూములను ప్రతిపాదించడంతో వీటిని తనిఖీ చేశారు. వీరి వెంట తహసీల్దార్ సుబ్బయ్య, సర్వేయర్ హరనాథ్, వీఆర్వో కోదండరామయ్య తదితరులు పాల్గొన్నారు.

కబడ్డీ పోటీలకు ఏర్పాట్లు



కబడ్డీ పోటీల ప్రాంగణాన్ని పరిశీలిస్తున్న సీఐ రామకృష్ణారెడ్డి

కోవూరు: స్థానిక మైథిలిసెంటర్‌లో శుక్రవారం నుంచి జరగనున్న రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు సంబంధించిన ఏర్పాట్లను గురువారం సీఐ కె.రామకృష్ణారెడ్డి పరిశీలించారు. వాహనాలను నిలుపు స్థలాన్ని, ప్రేక్షకులు నిలుచుకొనే ప్రదేశాలను, వేదిక, కబడ్డీ కోర్టును ఆయన పరిశీలించారు. కమిటీ సభ్యులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట జిల్లా కబడ్డీ అసోసియేషన్ కార్యదర్శి టి.లవకుమార్, ఆర్గనైజింగ్ కార్యదర్శి డి.విజయబాబు, సభ్యులు ఎ.సింహాద్రి, టి.జ్యోతికుమార్ తదితరులు ఉన్నారు.

వాటర్ ప్లాంట్ ప్రారంభం



ఇందుకూరుపేట: మండలంలోని మైపాడులో విర్బాక్ ఎనిమిల్ హెల్త్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ ఆధ్వర్యంలో నూతనంగా ఆర్వో మినరల్ వాటర్ ప్లాంట్‌ను ఏర్పాటు చేశారు. సుమారు రూ.2.75 లక్షలతో నిర్మించిన ఈ ప్లాంట్‌ను రీజనల్ మేనేజర్ ఎంవీవీ సత్యనారాయణ ప్రారంభించారు. కార్యక్రమంలో విర్బాక్ ఏరియా మేనేజర్ బి.ప్రసాద్, సర్పంచ్ సంగం వెంకయ్య, మాజీ సర్పంచ్ సురేంద్రరెడ్డి, గంపల వెంకటకృష్ణయ్య, సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

జరిమానా చెల్లించకుంటే వాహనాల సీజ్



వాహనాలను తనిఖీ చేస్తున్న మోటార్ వెహికల్ అధికారులు

బుచ్చిరెడ్డిపాళెం: గతంలో వాహనాలపై విధించిన జరిమానాలు చెల్లించకుంటే సీజ్ చేస్తామని మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ బాలమురళీకృష్ణ తెలిపారు. స్థానిక జొన్నవాడ సర్కిల్ వద్ద గురువారం వాహనాల తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంకా జరిమానాలు చెల్లించని వాహనాలను గుర్తించి వాటిని సీజ్ చేస్తామన్నారు. ముఖ్యంగా ఇదే సమయంలో పాఠశాల బస్సులను కూడా తనిఖీ చేశామని, అందులో కొన్ని బస్సులకు చెందిన డ్రైవర్లకు లైసెన్సులు లేకపోవడం ఆశ్చర్యాన్ని కలిగించిందన్నారు. ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలు వాహనాల విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరించరాదని హెచ్చరించారు. ఆయన వెంట అసిస్టెంట్ మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్లు, సిబ్బంది ఉన్నారు.

నేడు శ్రీరామపురంలో పశు వైద్యశిబిరం

వెంకటాచలం: మండలంలోని శ్రీరామపురంలో శుక్రవారం మండవ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉచిత పశువైద్యశిబిరం నిర్వహిస్తున్నట్లు ఫౌండేషన్ వైద్యుడు శ్రీనివాసులునాయుడు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. పశుపోషకులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

- రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి



వెంకన్నపాళెంలో ప్రజలతో మాట్లాడుతున్న రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి

తోటపల్లిగూడూరు: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సారథ్యంలో రాష్ట్రంలో కులమతాలు, రాజకీయాలకు అతీతంగా అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందిస్తున్నట్లు రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి తెలిపారు. గురువారం మండలంలోని వెంకన్నపాళెం గ్రామ సచివాలయ పరిధిలో మంత్రి కాకాణి ఆధ్వర్యంలో 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి కాకాణి గ్రామంలోని ఇంటింటికీ వెళ్లి రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల కరదీపికను అందిస్తూ ప్రజలతో మమేకమయ్యారు. అలాగే స్థానిక ప్రజలకు కావాల్సిన మౌలిక సదుపాయాల గురించి అడిగి తెలుసుకొంటూ సత్వర పరిష్కారానికి అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ప్రజా సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట వేస్తోందన్నారు. అన్నివర్గాల ప్రజల అవసరాలను గ్రామస్థాయిలోనే తీర్చేలా సచివాలయ, వలంటీర్ వ్యవస్థలను ఏర్పాటు చేసిన ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. రైతుల కోసం రైతుభరోసా కేంద్రాలు, వైద్యం కోసం ఏర్పాటు చేసిన వైఎస్సార్ హెల్త్‌క్లినిక్‌లు ఆదర్శంగా నిలుస్తున్నాయని తెలిపారు. గ్రామాల్లో చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రత్యక్షంగా పరిశీలించడం, అర్హతలు ఉండి సంక్షేమ ఫలాలు అందని వారికి అందేలా చర్యలు తీసుకోవడం 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమం ముఖ్య ఉద్దేశమన్నారు. గత టీడీపీ పాలనలో అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు రాష్ట్రంలో అవినీతికి కేరాఫ్‌గా మారితే ప్రస్తుతం అధికారంలో ఉన్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అభివృద్ధికి చిరునామాగా మారారని గుర్తు చేశారు. వెంకన్నపాళెం పంచాయతీలో గత మూడున్నరేళ్ల వైఎస్సార్‌సీపీ పాలనలో దాదాపు రూ.5.30 కోట్లతో అభివృద్ధి పనులను చేపట్టామని తెలిపారు. తొలుత మంత్రి కాకాణి వెంకన్నపాళెం ఎస్సీకాలనీలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి చిల్లకూరు సుధీర్‌రెడ్డి, మండల కన్వీనర్ ఉప్పల శంకరయ్యగౌడ్, ఎంపీపీ ఉప్పల స్వర్ణలత, జెడ్పీటీసీ సభ్యురాలు ఎంబేటి శేషమ్మ, నాయకులు దువ్వూరు గంగాధర్‌రెడ్డి, దుంపల ఏసోబు, చింతా సుబ్రహ్మణ్యం, ముత్యాల మహేంద్ర, ముత్యాల మల్లేశ్వర్, లేబూరు మల్లికార్జున్, ఆకుల మధు తదితరులు పాల్గొన్నారు.

చిరుధాన్యాల సాగుపై దృష్టి సారించండి



మాట్లాడుతున్న డీటీసీడీఆర్‌సీ కోఆర్డినేటర్ సత్యవాణి

ఇందుకూరుపేట: చిరుధాన్యాల సాగుపై మహిళా రైతులు దృష్టి సారించాలని డీటీసీడీఆర్‌సీ కోఆర్డినేటర్ సత్యవాణి సూచించారు. ఆత్మ, వ్యవసాయ సాంకేతిక సంస్థ, జిల్లా వనరుల కేంద్రం ఆధ్వర్యంలో 'జీ–20 మహిళల స్వావలంబన, అభివృద్ధి – సాధికారత'పై గురువారం శిక్షణ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఐక్యరాజ్యసమితి 2023వ సంవత్సరాన్ని అంతర్జాతీయ చిరుధాన్యాల సంవత్సరంగా ప్రకటించిందని తెలిపారు. తొమ్మిది రకాల చిరుధాన్యాల పంటల ఉత్పత్తులను విలువ ఆధారిత ఉత్పత్తులుగా మార్చడానికి యంత్రాలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. కేవీకే శాస్త్రవేత్త కిరణ్ రాగి, జొన్న, సజ్జల తదితర పంటల సాగుపై వివరించారు. కార్యక్రమంలో ఏడీలు రాజ్‌కుమార్, మారుతీదేవి, ఏఓ రఘునాథ్‌రెడ్డి, శిరీష, వ్యవసాయశాఖ సహాయకుడు నవీన్, మహిళలు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

పనుల్లో అవకతవకలు ఉంటే చర్యలు



మాట్లాడుతున్న ఎంపీడీఓ కల్పన

ఇందుకూరుపేట: ఉపాధి హామీ పథకం ద్వారా చేపట్టిన పనులను సామాజిక తనిఖీ బృందం పక్కాగా పరిశీలిస్తోందని, అవకతవకలు జరిగి ఉంటే చర్యలు తప్పవని ఎంపీడీఓ కల్పన హెచ్చరించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో గురువారం ఉపాధి పనులకు సంబంధించి అధికారులతో ఆమె సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 2021 ఏప్రిల్ నుంచి 2022 మార్చి నెల వరకు ఉపాధి హామీ పథకం నిధులతో చేపట్టిన పనులను అధికారుల బృందం తనిఖీ చేస్తోందన్నారు. వీరికి అందరూ సహకరించాలని కోరారు. సిబ్బంది 15 రోజులపాటు గ్రామ పంచాయతీల్లో అందుబాటులో ఉంటారన్నారు. తనిఖీ అనంతరం ప్రజావేదిక నిర్వహిస్తారని తెలిపారు. కార్యక్రమంలో పీఆర్ ఏఈ ఖాదర్‌బాషా, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ హజరత్, సర్వశిక్షా అభియాన్ అధికారులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీకి ఘన సన్మానం



ఎమ్మెల్సీ విఠపును సన్మానిస్తున్న అధ్యాపక బృందం

కొడవలూరు: మండలంలోని నార్తురాజుపాళెంలో వెంకటేశ్వర ఇంజినీరింగ్ కళాశాలలో ఎమ్మెల్సీ విఠపు బాలసుబ్రహ్మణ్యంను అధ్యాపక బృందం గురువారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా సన్మాన గ్రహీత విఠపు మాట్లాడుతూ న్యూ ఎడ్యుకేషన్ పాలసీ(ఎన్ఈపీ)ని ప్రతి కళాశాలలో అమలు చేయాలన్నారు. గుర్తింపు పొందిన విద్యా సంస్థల్లో పనిచేసే అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది ఉద్యోగ భద్రత, సోషల్ సెక్యూరిటీ, హెల్త్ కార్డ్స్ తదితర అంశాలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళతామని తెలిపారు. కార్యక్రమంలో కళాశాల చైర్మన్ పెనుబల్లి బాబునాయుడు, డైరెక్టర్ పి.కృష్ణచైతన్య, ప్రిన్సిపల్ పి.కుమార్‌బాబు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ నాయకుల సంబరాలు



సంబరాలు జరుపుకుంటున్న వైఎస్సార్‌సీపీ శ్రేణులు

బుచ్చిరెడ్డిపాళెం: నెల్లూరు బ్యారేజ్‌కు మాజీ మంత్రి నల్లపరెడ్డి శ్రీనివాసులురెడ్డి పేరుపెట్టేందుకు రాష్ట్ర కేబినెట్ ఆమోదం తెలపడంతో బుచ్చిరెడ్డిపాళెంలో గురువారం రాత్రి వైఎస్సార్‌సీపీ నాయకులు భారీస్థాయిలో సంబరాలను జరుపుకున్నారు. వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ చెర్లో సతీష్‌రెడ్డి, సచివాలయాల కమిటీ పర్యవేక్షణ కన్వీనర్ మోర్ల మురళి, యువజన విభాగం నియోజకవర్గ కమిటీ సభ్యుడు చీర్ల ప్రసాద్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ సంబరాల్లో దాదాపు 200 మంది వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు. స్థానిక వైఎస్సార్ విగ్రహం వద్ద భారీస్థాయిలో బాణసంచా పేల్చి మిఠాయిలు పంచిపెట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లాలో మకుటం లేని నాయకుడిగా నల్లపరెడ్డి శ్రీనివాసులురెడ్డి ఉండేవారని, అలాంటి వ్యక్తి పేరు చిరస్థాయిగా నిలిచిపోయేలా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నెల్లూరు బ్యారేజ్‌కు పెట్టడం అభినందనీయమన్నారు. ఆయన అడుగుజాడల్లోనే ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి కూడా నడుస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ పట్టణ అధ్యక్షుడు బట్టా విల్సన్, నాయకులు రసూల్, రాఘవ, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

నకిలీ సర్టిఫికెట్స్‌పై విచారణ జరపాలి



వీఎస్‌యూ వైస్ చాన్సలర్‌కు వినతిపత్రం అందజేస్తున్న విద్యార్థి జేఏసీ నాయకులు

వెంకటాచలం: వెంకటగిరి పట్టణంలోని అమరావతి జూనియర్ కళాశాలలో 2022–23 విద్యా సంవత్సరానికి సంబంధించి నకిలీ సర్టిఫికెట్స్‌పై విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని విద్యార్థి జేఏసీ నాయకులు కోరారు. ఈ మేరకు మండలంలోని కాకుటూరు వద్దనున్న విక్రమ సింహపురి విశ్వవిద్యాలయంలో వైస్ చాన్సలర్ జీఎం సుందరవల్లిని విద్యార్థి జేఏసీ నాయకులు గురువారం కలిసి వినతిపత్రం అందజేశారు. అమరావతి జూనియర్ కళాశాలలో సీనియర్ ఇంటర్ చదివి ఫెయిల్ అయిన దాదాపు 40 మంది విద్యార్థులకు కళాశాల యాజమాన్యం జార్ఖండ్ యూనివర్సిటీ నుంచి నకిలీ సర్టిఫికెట్స్ అందజేశారని ఆరోపించారు. దీంతో ఆ విద్యార్థులు పట్టణంలోని పలు కళాశాలల్లో నకిలీ సర్టిఫికెట్స్‌తో డిగ్రీ కోర్సుల్లో చేరారని, ఈ విషయంపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై క్రిమినల్ కేసులు నమోదు చేయించాలని కోరారు. కార్యక్రమంలో విద్యార్థి జేఏసీ నాయకులు ఆదిత్య సాయి, లీలామోహన్, సాజిద్, రాము, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు మంత్రి కాకాణి అభినందన



వెంకటాచలం: జాతీయస్థాయి కరాటే పోటీల్లో ప్రతిభ చూపిన విద్యార్థులను రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి అభినందించారు. మండలంలోని సర్వేపల్లికి చెందిన దూడల సుధీర్ కుమారులు లోకేష్(7వ తరగతి), విద్యానివాస్(5వ తరగతి) ఈ నెల 5వ తేదీ వరకు హైదరాబాద్‌లో జరిగిన జాతీయ స్థాయి కరాటే పోటీల్లో పాల్గొని గోల్డ్ మెడల్ సాధించారు. గురువారం నెల్లూరులోని మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి క్యాంపు కార్యాలయంలో లోకేష్, విద్యానివాస్‌లు మంత్రి కాకాణిని కలిశారు. ఈ సందర్భంగా మంత్రి కాకాణి వారిని అభినందించారు.

నాడు–నేడు పనుల పరిశీలన

కొడవలూరు: కొడవలూరు దర్గా సంఘం ప్రాథమిక పాఠశాలలో జరుగుతున్న 'మన బడి నాడు–నేడు' పథకం పనులను ఎంపీడీఓ పి.సుబ్రహ్మణ్యం ఎంఈఓ జి.వసంతకుమారితో కలిసి గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పాఠశాలలో మరుగుదొడ్లు, తాగునీరు తదితర వసతుల కోసం నాడు–నేడు పథకం ద్వారా రూ.13 లక్షలు మంజూరు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఇంజినీరింగ్ అసిస్టెంట్ శ్రీకాంత్, మహిళా పోలీసు వెంకటసుబ్బమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఉగాదికి ఇళ్ల నిర్మాణం పూర్తి చేయాలి



మాట్లాడుతున్న మండల ప్రత్యేకాధికారి సోమయ్య

ముత్తుకూరు: ఉగాది నాటికి నిర్దేశించిన పక్కాగృహాల నిర్మాణం పూర్తిచేయాలని మండల ప్రత్యేకాధికారి డాక్టర్ సోమయ్య సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గురువారం జరిగిన జగనన్న లే అవుట్ల ఇన్‌చార్జిల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రతి కాలనీ ఇన్‌చార్జిని వారి సమస్యలు అడిగి తెలుసుకొన్నారు. 1,046 ఇళ్లకు గాను ఇప్పటివరకు 651 ఇళ్లు పూర్తయ్యాయని తెలిపారు. మిగిలిన 402 ఇళ్ల నిర్మాణం త్వరగా పూర్తిచేయాలని సూచించారు. అలాగే నిర్మాణం ప్రారంభం కాని ఇళ్ల పనులు వెంటనే మొదలుపెట్టేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. పూర్తి చేసిన ఇళ్లకు బిల్లులు కూడా సకాలంలో చెల్లిస్తున్నట్లు తెలిపారు. సమావేశంలో తహసీల్దార్ మనోహర్‌బాబు, ఎంపీడీఓ ప్రత్యూష, ఎంఈఓ మధుసూదన్ పాల్గొన్నారు.

మహిళకు బెదిరింపులు

నెల్లూరు(క్రైమ్): ఓ మహిళ కుటుంబాన్ని చంపుతామని బెదిరిస్తున్న ఇద్దరిపై వేదాయపాళెం పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల సమాచారం మేరకు.. ఇస్కాన్ సిటీలో ఓ మహిళ తన భర్త, కుమార్తెతో నివాసం ఉంటున్నారు. కేన్సర్‌తో బాధపడుతున్న ఆమె హైదరాబాద్‌లో చికిత్స పొందుతున్నారు. దీంతో బంధువుల ద్వారా యూసఫ్‌గూడలో ఉంటున్న రామ్‌ప్రసాద్‌తో మహిళ కుటుంబానికి పరిచయమైంది. చెకప్‌కు వెళ్లిన సమయంలో వారు అతని ఇంట్లో ఉండేవారు. ఆర్నెల్ల క్రితం రామ్‌ప్రసాద్ మొదటి భార్య ఆమెకు ఫోన్ చేశారు. అతని గురించి చెప్పి సాయం చేయాలని కోరారు. విషయం తెలుసుకున్న రామ్‌ప్రసాద్ తన స్నేహితుడు సంతోష్‌తో కలిసి తన వ్యక్తిగత విషయాలు మీకెందుకంటూ వారం రోజులుగా మహిళ కుటుంబానికి ఫోన్ చేసి అసభ్యపదజాలంతో దూషించడంతో పాటు చంపుతామని బెదిరించసాగారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

పిల్లల్లో వ్యక్తిగత పరిశుభ్రత ప్రధానం

- ఆర్బీఎస్కే జిల్లా ప్రోగ్రామ్ ఆఫీసర్ సుధీర్‌కుమార్



విద్యార్థులకు సూచనలిస్తున్న ఆర్బీఎస్కే ప్రోగ్రామ్ ఆఫీసర్

కొడవలూరు : పిల్లలు ప్రధానంగా వ్యక్తిగత పరిశుభ్రతను పాటించాలని ఆర్బీఎస్కే (రాష్ట్రీయ బాల స్వస్థ కార్యక్రమం) జిల్లా ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ ఎస్వీ.సుధీర్‌కుమార్ సూచించారు. మండలంలోని చంద్రశేఖరపురం ప్రాథమికోన్నత పాఠశాలలో పిల్లల్లో వచ్చే వ్యాధులు, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై గురువారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య వక్తగా వచ్చిన ఆయన మాట్లాడుతూ ఆరుబయట మల విసర్జన చేయరాదన్నారు. మల, మూత్ర విసర్జనల అనంతరం విధిగా చేతులను శుభ్రం చేసుకోవాలని చెప్పారు. రక్తంలో హిమోగ్లోబిన్ లోపిస్తే గుండె సంబంధిత సమస్యలు సంభవిస్తాయన్నారు. అందువల్ల హిమోగ్లోబిన్ తగ్గితే వెంటనే వైద్యశాఖ వారు ఇచ్చే ఐరన్ మాత్రలను ప్రతిరోజూ విధిగా వాడాలన్నారు. నులి పురుగుల మందులు సంవత్సరంలో రెండు సార్లు తప్పక వేసుకోవాలన్నారు. ప్రతి ఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రత పాటించడంతో పాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. పాఠశాల పరిసరాలను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం డేగా మురళీమోహన్‌రావు, ఉపాధ్యాయులు శివకుమార్, పెంచలయ్య, భవాని, వైద్య సిబ్బంది టి.రాధమ్మ, కె.పద్మజ, ఎస్.కల్పన, బి.శీనమ్మ పాల్గొన్నారు.

అడిగిన వారికి పనులు కల్పించాలి

- పీడీ వెంకట్రావ్



ఉపాధి పనులను పరిశీలిస్తున్న పీడీ వెంకట్రావ్

బుచ్చిరెడ్డిపాళెం(విడవలూరు) : అర్హత కలిగిన ప్రతి ఒక్కరికీ జాతీయ ఉపాధి హామీ పథకం కింద పనిదినాలు కల్పించాలని ఎన్ఆర్ఈజీఎస్ పీడీ వెంకట్రావ్ అన్నారు. మండలంలోని పార్లపల్లిలో ఉపాధి హామీ పథకం కింద జరుగుతున్న కాలువ పనులను గురువారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా పీడీ మాట్లాడుతూ ప్రతి కూలీని రోజుకు రెండుసార్లు నాలుగు గంటల వ్యవధిలో ఫొటోలు తీయాలని ఆదేశించారు. అలాగే ప్రతి కూలీకి రోజుకు రూ.237 గిట్టుబాటు అయ్యే విధంగా పని కల్పించాలని, ఇందుకు క్షేత్రస్థాయి సిబ్బంది చర్యలు తీసుకోవాలన్నారు. ప్రస్తుతం మండలంలో రబీ కింద వరిసాగు ముమ్మరంగా సాగుతున్న తరుణంగా చిన్నపాటి కాలువల పూడికతీత పనులు చేపట్టాలని కోరారు. అనంతరం పలు మస్టర్లను తనిఖీ చేసి, కూలీలతో మాట్లాడారు. ఆయన వెంట ఈసీ సోఫియా, సిబ్బంది ఉన్నారు.

షటిల్ పోటీల విజేతలకు బహుమతులు



బహుమతులు అందుకున్న విజేతలు

పొదలకూరు: పట్టణంలో ఈ నెల 7, 8 తేదీల్లో వినాయక షటిల్ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించిన మండలస్థాయి షటిల్ బ్యాడ్మింటన్ డబుల్స్‌లో విజేతలకు బుధవారం రాత్రి జరిగిన ముగింపు సమావేశంలో బహుమతులను అందజేశారు. ప్రథమ, ద్వితీయ, తృతీయ, నాలుగో స్థానాల్లో వరుసగా వూకోటి శ్రీనివాస తేజ, అడపాల మస్తాన్‌రెడ్డి, వూకోటి లక్ష్మీనారాయణ, అయితా రమేష్, బీపీ నారాయణరెడ్డి, ఎ.శేషారెడ్డి, విజయభాస్కర్‌రెడ్డి, శివ నిలిచారు. వినాయక షటిల్ క్లబ్ అధ్యక్షుడు చాట్ల రాధాకృష్ణ చేతులమీదుగా బహుమతులు అందుకున్నారు. కార్యక్రమంలో క్లబ్ గౌరవాధ్యక్షుడు వూకోటి లక్ష్మీనారాయణ, క్రీడాకారులు పెంచలయ్య, హరికృష్ణ, డాక్టర్ ప్రవీణ్, మనోజ్, బాలు, శ్రీధర్ పాల్గొన్నారు.

అందుబాటులో ధాన్యం కొనుగోలు కేంద్రాలు



బుచ్చిరెడ్డిపాళెం: మాట్లాడుతున్న వ్యవసాయాధికారి వెంకటకృష్ణయ్య.

బుచ్చిరెడ్డిపాళెం(విడవలూరు): రబీ సీజన్‌లో వరి సాగు రైతులకు రాష్ట్ర ప్రభుత్వం ధాన్యం కొనుగోలు కేంద్రాలను అందుబాటులోకి తీసుకువస్తోందని మండల వ్యవసాయాధికారి వెంకటకృష్ణయ్య తెలిపారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల ఏర్పాటుపై మండలంలోని అలగానిపాడులో గురువారం రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విడవలూరు మండలంలోని అలగానిపాడు, ముదివర్తి, రామతీర్థం, వావిళ్ల, విడవలూరు–1, విడవలూరు–2లలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి రైతులు పండించిన ధాన్యాన్ని కొనుగోలు చేయనున్నట్లు తెలిపారు. రైతులు పండించిన ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాల్లో విక్రయించాలని కోరారు. కార్యక్రమంలో పౌరసరఫరాలశాఖ డీటీ కృష్ణప్రసాద్, సర్పంచ్ గండవరపు వివేకానందరెడ్డి, రెవెన్యూ, వ్యవసాయశాఖ అధికారులు పాల్గొన్నారు.

అవినీతికి తావులేకుండా..

కొడవలూరు: ధాన్యం సేకరణలో అవినీతికి తావులేకుండా ప్రభుత్వం కొత్త నిబంధనలు అమలు చేస్తున్నట్లు పౌరసరఫరాలశాఖ డీటీ కృష్ణప్రసాద్ తెలిపారు. మండలంలోని గుండాలమ్మపాళెం, గండవరం, కొత్తవంగల్లు రైతుభరోసా కేంద్రాల్లో కొనుగోలు కేంద్రాల నూతన నిబంధనలపై రైతులకు గురువారం అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. సమావేశంలో ఏఓ సీహెచ్ఎస్ లక్ష్మి, వీఆర్వోలు రాహుల్ తేజ్, దుర్గాప్రసాద్, శ్రీనివాసులు, వీఏఏలు విష్ణుప్రియ, కవిత, వంశీకృష్ణ, రైతు నాయకుడు నాగేంద్రరెడ్డి పాల్గొన్నారు.

ధాన్యానికి మద్దతు ధర

మనుబోలు: రైతులు పండించిన ధాన్యానికి కొనుగోలు కేంద్రాల ద్వారా ప్రభుత్వం మద్దతు ధర కల్పిస్తున్నట్లు తహసీల్దార్ సుధీర్ తెలిపారు. మండలంలోని వీరంపల్లి రైతుభరోసా కేంద్రంలో గురువారం ధాన్యం మద్దతు ధరపై రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. దళారులకు ధాన్యం అమ్మి మోసపోవద్దని సూచించారు. సమావేశంలో ఏఓ జహీర్, ఏఏబీ చైర్మన్ జట్టి సురేందర్‌రెడ్డి, వీఆర్వో భక్తవత్సలరెడ్డి, వీఏఏ శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

ఆర్బీకేల ద్వారా ధాన్యం కొనుగోలు

వెంకటాచలం: రైతులు పండించిన ధాన్యాన్ని రైతు భరోసా కేంద్రాల ద్వారా ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని తహసీల్దార్ కృష్ణ తెలిపారు. మండలంలోని పూడిపర్తి గ్రామంలో గురువారం రైతులతో సమావేశం నిర్వహించారు. ధాన్యానికి మద్దతు ధర కల్పించేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టిందన్నారు. సమావేశంలో మండల వ్యవసాయశాఖాధికారి హరికరుణాకర్‌రెడ్డి, అధికారులు పాల్గొన్నారు.

సాయినాథునికి విశేష పూజలు



మనుబోలు: సాయినాథునికి హారతి ఇస్తున్న భక్తులు



కోవూరు: బాబా మందిరంలో అన్నదానం చేస్తున్న దాతలు

మనుబోలు: స్థానిక కోదండరామపురంలో ఉన్న సాయిబాబా ఆలయంలో గురువారం సాయినాథునికి విశేష పూజలు నిర్వహించారు. ఉదయం అర్చకుడు శ్రీనివాసులు సాయిబాబాకు పంచామృతాభిషేకం, పుష్పాలతో ప్రత్యేక అలంకరణ, పూజలు నిర్వహించారు. భక్తులు స్వామివారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. అలాగే జెడ్పీ మాజీ వైస్ చైర్మన్ చిట్టమూరు పద్మనాభరెడ్డి వర్ధంతిని పురస్కరించుకుని జెడ్పీటీసీ సభ్యురాలు చిట్టమూరు అనితమ్మ, వైఎస్సార్‌సీపీ నాయకుడు అజయ్‌కుమార్‌రెడ్డి దంపతులు ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. డాక్టర్ సీఎంకే రెడ్డి – డాక్టర్ నిర్మలమ్మ దంపతులు ఉభయకర్తలుగా వ్యవహరించారు. సాయంత్రం సాయినాథునికి పల్లకిసేవ నిర్వహించారు.

బాబాకు ప్రత్యేక పూజలు

పొదలకూరు: పట్టణంలోని శ్రీషిర్డీసాయిబాబా మందిరంలో గురువారం బాబాకు విశేష పూజలు నిర్వహించారు. ఉదయం బాబాకు అభిషేకాలు, అలంకరణ, అష్టోత్తర, సహస్ర నామ పూజలు చేశారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం చేశారు. సాయంత్రం మందిరంలో భక్తులు బాబా భజనలు చేయగా, రాత్రి స్వామివారికి పల్లకిసేవ నిర్వహించారు. శేజ్ హారతితో పూజా కార్యక్రమాలు ముగిశాయి.

అన్నదానం

కోవూరు: స్థానిక జాతీయ రహదారి సమీపంలో ఉన్న షిర్డీసాయిబాబా మందిరంలో గురువారం బాబాకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం చేశారు. ఈ కార్యక్రమానికి పచ్చిపాల సుధాకర్‌రెడ్డి కుమారుడు బాజ్జీ దాతగా నిర్వహించారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ పచ్చిపాల రాధాకృష్ణారెడ్డి, మల్లికార్జునరెడ్డి, ఆంజనేయులు, జగదీష్‌స్వామి తదితరులు పాల్గొన్నారు.